


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 13-08-2023 సంపుటి : 04 సంచిక : 303 పేజీలు : 8 వెల : రూ 3-00

## ఆ భయంతోనే 'అవిశ్వాసం' ఓటింగ్‌పై విపక్షాల వాకౌట్..!



కోల్‌కతా: మణిపుర్ విషయంలో కేంద్ర ప్రభుత్వంపై విపక్షాలు ప్రవేశపెట్టిన 'అవిశ్వాస తీర్మానం వీగిపోయిన విషయం తెలిసిందే .విపక్షాలు వాకౌట్ చేయడంతో ఓటింగ్ జరగలేదు. అయితే, 'ఇండియా' కూటమిలో చీలికలు బయటపడతాయనే భయంతోనే విపక్షాలు ఓటింగ్‌కు ముందుకు రాలేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన భాజపా కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా బెంగాల్‌లోని అధికార టీఎంసీసహా ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు.' పార్లమెంటులో విపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ఇటీవలే ఓడించాం. అవి వ్యాప్తిజేస్తోన్న ప్రతికూలతను కూడా ఓడించాం. తమ కూటమిలోని చీలికలను బయటపెడుతుందనే భయంతోనే ప్రతిపక్షాలు ఓటింగ్ కోరుకోలేదు. సభనుంచి జారుకున్నాయి' అని ప్రధాని మోదీ విమర్శించారు. మణిపుర్ అంశంపై ప్రతిపక్షాలు చర్చను కోరుకోలేదని, కేవలం దానిపై రాజకీయాలు చేయాలనుకున్నాయని ధ్వజమెత్తారు. 'గరీబీ హఠావో' అని చెప్పే కాంగ్రెస్.. దేశంలో పేదరికాన్ని పారదోలేందుకు ఏమీ చేయలేదన్నారు. పేదల సమగ్రాభివృద్ధికి భాజపా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు.ఇటీవలి పంచాయతీ ఎన్నికల సందర్భంగా బెంగాల్‌లోని ప్రతిపక్షాలను భయపెట్టేందుకుగానూ అధికార టీఎంసీ.. హింస, బెదిరింపులను ఆయుధాలుగా వాడుకుందని ప్రధాని మోదీ ఆరోపించారు. అయినప్పటికీ.. తమ పార్టీ అభ్యర్థులను స్థానికులు ఆశీర్వదించారని పేర్కొన్నారు. భాజపా అభ్యర్థుల విజయోత్సవ ర్యాలీలకు అనుమతి ఇవ్వలేదని, కొందరు ర్యాలీ తీసినా.. వారిపై దాడులు చేశారని.. ఇదీ టీఎంసీ రాజకీయమని మండిపడ్డారు. ఇదిలా ఉండగా.. గత నెలలో బెంగాల్‌లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పలు హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు.

## రాత్రి తిరుమల కాలిబాట మూసేసే ఆలోచన

### తాజా ఘటనల నేపథ్యంలో టిటిడి ఇవో వెల్లడి

తిరుమల,అగస్టు12: తిరుమల, తిరుపతి దేవస్థానం ఈవో ధర్మారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శ్రీవారి దర్శనానికి కాలిబాటన వచ్చే మార్గాన్ని మూసివేయాలని ఆలోచిస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి నుంచి తిరుమల ఉన్న రెండు కాలిబాటలను సాయంత్రం 6 గంటలకు మూసేయాలని ఆలోచిస్తున్నామని వెల్లడించారు. ఈ విషయంపై టీటీడీ చైర్మన్, అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని , ప్రతి పది మీటర్లకు సెక్యూరిటీ గార్డును నియమిస్తామని వివరించారు. శుక్రవారం రాత్రి అలిపిరి బాటన చిన్నారిని చంపివేసిన చిరుత ఘటనపై శనివారం తిరుమల జేఈవో కార్యాలయంలో అటవీ శాఖ, పోలీసులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భక్తుల భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. చిరుత దాడిలో చనిపోయిన చిన్నారి లక్షిత ఘటన బాధకరమని ఆయన అన్నారు. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు పాప మిస్ అయ్యిందని, పాప ఆచూకీ కోసం70 మంది దాకా సిబ్బంది రాత్రి అటవీ ప్రాంతంలో గాలించారని తెలిపారు.

## ఉద్యోగుల ఇళ్ల స్థలాలపై సీఎస్ సమీక్ష..



విజయవాడ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చే అంశంపై శనివారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్.జవహర్ రెడ్డి అధికారులతో సమీక్షించారు.వివిధ ఉద్యోగ సంఘాల హౌసింగ్ సొసైటీల వారీగా ఇళ్ళ స్థలాలకు ఎంత మేర భూమి అవసరం ఉంది పరిశీలన జరపాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీసీఎల్ఏ జీ.సాయి ప్రసాద్ కు సీఎస్ సూచించారు.అంతేగాక ఈవిషయమై ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించి ఒక నివేదిక సమర్పించాలని ఆదేశించారు.పది రోజుల్లో ఉద్యోగుల ఇళ్ళ స్థలాల అంశంపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి అన్నారు.పట్టణ ప్రాంతాల్లో పబ్లిక్ హౌసింగ్ విధానాన్ని తీసుకు వచ్చే అంశంపై దృష్టి సారించాలని అధికారులను సీఎస్ జవహర్ రెడ్డి సూచించారు.దానివల్ల పట్టణ ప్రాంతాల్లో ఇళ్ళు లేనివారు, ఇళ్ళు ఉన్నా రోడ్లు,ఫుట్ పాత్ లు,కాలువలు,డ్రైన్లు వంటి వివిధ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని చిన్న చిన్న గుడిసెలు,గుడారాలు వంటివి ఏర్పాటు చేసుకుని జీవనం సాగించే వారిని కట్టడి చేసి వారికి ప్రభుత్వమే పబ్లిక్ హౌసింగ్ విధానంలో నిర్మించిన ఇళ్ళలో నివసించేలా చేయవచ్చని తెలిపారు.దాంతో పట్టణాలను మరింత సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ద వచ్చని సిఎస్ పేర్కొన్నారు.రాష్ట్రంలో ఉద్యోగులకు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాన్ని(ఇహెచ్ఎస్)మరింత పారదర్శకంగా,పటిష్టవంతంగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్. జవహర్ రెడ్డి స్పష్టం చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకంపై శనివారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో ఆయన వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు.ఈ పథకం అమలులో వివిధ ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన పలు డిమాండ్లు వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై ఆయన వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యం.టి.కృష్ణబాబుతో సమీక్షించారు.మరో పది రోజుల్లో ఉద్యోగుల ఆరోగ్య పథకంపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారని సీఎస్ పేర్కొన్నారు.ఈపథకం అమలుపై ఇటీవల ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో వచ్చిన వివిధ ప్రతిపాదనలు వాటి అమలు గురించి సీఎస్ సమీక్షించారు.అంతేగాక ఈ పథకాన్ని మరింత సమర్ధవంతంగా, పారదర్శకంగా అమలు చేసేందుకు తీసుకోవాల్సిన అంశాలపై సీఎస్ జవహర్ రెడ్డి సమీక్షించారు.సెప్టెంబర్ నెలాఖరు నాటికి అందరికీ ఇహెచ్ఎస్ కార్డులు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని స్పెషల్ సీఎస్ కృష్ణబాబు చెప్పారు.రాష్ట్రం లోని 53 ఏరియా ఆసుపత్రిల్లో ఇహెచ్ఎస్ సేవలకై ప్రత్యేక క్లినిక్లు అందుబాటులోకి రానున్నాయని కృష్ణబాబు తెలిపారు.ఇంకా ఇహెచ్ఎస్ అమలుకు సంబంధించి తీసుకున్న చర్యలపై వివరించారు.

## ఉగాది నాటికి ఆ రెండు పార్టీల అడ్రస్ గల్లంతు

### లేకుంటే గుండు కొట్టించుకుంటానన్న బొత్స



శ్రీకాకుళం,ఆగస్ట్ 12:ఏపీ లో పాలిటిక్స్ హీటెక్కుతున్నాయి. అధికారపక్షం, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్దాలు నడుస్తున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో పార్టీలు దూకుడు పెంచుతున్నాయి. పరస్పర విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతున్నారు. తాజాగా.. శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో జరిగిన గడప గడపకు విజయోత్సవ సభలో మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడారు. పవన్ కళ్యాణ్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వచ్చే ఉగాదికి రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు ఉండవని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఒకవేళ ఉంటే తాను గుండు కొట్టించుకుంటానన్నారు. పచ్చపత్రికలు అపోహలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా పెట్టిన పార్టీ వైసీపీ అన్నారు. మామూలు పనులు చేసే వ్యక్తి సీఎం జగన్ కాదన్నారు. గడప గడపకు కార్యక్రమంతో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడంతో పాటు స్థానిక నాయకులకు, కార్యకర్తల్లో ధైర్యం నింపుతున్నట్లు చెప్పారు. రాజకీయాల్లో నలబై సంవత్సరాల ఇండస్ట్రీ అని చెప్పుకునే వ్యక్తి, మరో పక్క సినిమా పరిశ్రమకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిని ఆడిపోసుకుంటే నాయకుడు అయిపోతాడని పవన్ కల్యాణ్ అనుకుంటున్నాడని మండిపడ్డారు.

## విజయవాడ డివిజన్ పరిధిలో పలు రైళ్లు రద్దు.. మరికొన్ని దారి మళ్లింపు

విజయవాడ: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ రైల్వే డివిజన్‌లో భద్రతా పరమైన పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ మార్గంలో ప్రయాణించే రైళ్ల సర్వీసుల రాకపోకల్లో దక్షిణ మధ్య రైల్వే మార్పులు చేసింది. పలు రైళ్లను రద్దు చేసి, మరికొన్నింటిని దారి మళ్లించింది.

రద్దు చేసిన రైళ్ల సర్వీసులు..

1. 14.08.2023 నుంచి 20.08.2023 వరకు కాకినాడ – విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్ రద్దు.
2. 14.08.2023 నుంచి 20.08.2023 వరకు విశాఖపట్నం – కాకినాడ ప్యాసింజర్ ప్రత్యేక రైలు రద్దు.
3. 14.08.2023 నుంచి 20.08.2023 వరకు రాజమండ్రి – విశాఖపట్నం ప్యాసింజర్ ప్రత్యేక రైలు రద్దు.
4. 14.08.2023 నుంచి 20.08.2023 వరకు విశాఖపట్నం – రాజమండ్రి ప్యాసింజర్ ప్రత్యేక రైలు రద్దు.

## రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ మీట్స్ ...

### పాల్గొన్న నాలుగు మండలాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఆర్ డి టి రీజినల్ డైరెక్టర్ రామేశ్వరి

పెద్దకడబూరు ఆగష్టు 12:ూ ( విభారె న్యూస్) పెద్దకడబూరు మండలంలోని కంబళదిన్నే గ్రామంలో ఉన్న హైస్కూల్ పిల్లలు ఎమ్మిగనూరు పట్టణంలో స్థానిక గవర్నమెంట్ బాయ్స్ హై స్కూల్ మైదానంలో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆర్ డి టి ఏరియా టీమ్ లీడర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నాలుగు మండ లాల స్థాయిలో గ్రామీణ అండర్ 15 బాలికలు అథ్లెటిక్స్ మీట్స్ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ డి టి రీజినల్ డైరెక్టర్ రాజేశ్వరమ్మ , పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ మస్తాన్ వలీ,వేదాస్ స్వచ్ఛంద సేవ సంస్థ అధినేత కదిరి కోట సునీల్ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు ఈ స్పోర్ట్స్ మిట్ కార్యక్రమాలో పరుగు పోటీలు (ట్రాక్ ఈవెంట్స్)100 ,200 ,400 మీటర్లు మరియు ఫీల్డ్ ఈవెంట్లు లాంగ్ జంప్ , షాట్-పుట్ నిర్వహించారు ఇందులో మొత్తం నాలుగు మండలాల ప్రభుత్వ బాలికల పాఠశాల , కస్తూరిబా పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన షాట్ పుట్ లో మొదటి స్థానం సాధించిన జిల్లా పరిషత్ హై స్కూల్ మూగతి చెందిన బి లక్ష్మి మరియు లాంగ్ జంప్ లో మొదటి స్థానం సాధించిన మా చని సోమప్ప జిల్లా పరిషత్ హై స్కూల్ ఎమ్మిగనూర్ పాఠశాలకు చెందిన బి శిరీష , 400 మీటర్ల లాంగ్ పరుగు పందానికి, మరియు వరుసగా 100 మీటర్స్ 200 మీటర్స్ మరియు 400 మీటర్స్ బి లక్ష్మి , బీరా లింగమ్మ జిల్లా పరిషత్ హై స్కూల్ కమ్మలదిన్నె విద్యార్థులులకు టాప్ 3 అథ్లెట్లకు బంగారు, వెండి మరియు కాంస్య పతకాలు ,మెడల్స్ మరియు సర్టిఫికెట్స్ అందజేశారు ఎమ్మిగనూరు ఏరియా స్థాయిలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులకు అనంతపురం క్రీడా గ్రామంలో జరిగే సెంట్రల్ లెవల్ ఛాంపియన్ షిప్ కు అర్హత సాధించారని విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ మరియు వసతి రవాణా ఖర్చులన్నీ ఆర్డిటి సమస్యని భరిస్తుందని కాబట్టి మంచి పేరు తీసుకురావాలని రిజినల్ డైరెక్టర్ రాజేశ్వరమ్మ తెలియజేశారు.ఈ కార్యక్రమానికి హాజరైన నాలుగు మండలాల విద్యార్థులకు మరియు వ్యాయామ ఉపాధ్యాయులకు వేదాస్ స్వచ్ఛంద సేవ సంస్థ డైరెక్టర్, కదిరి కోట సునీల్ దాదాపుగా 150 మంది విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించారు వీరిని ఆర్ డి టి రీజినల్ డైరెక్టర్ రాజేశ్వరమ్మ మరియు ఏరియా టీమ్ లీడర్ సుబ్రమణ్యం ఘనంగా సన్మానం చేశారు ఈ కార్యక్రమ ంలో వ్యాయామ ఉపాధ్యాయు లు , ఆర్డిటి సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.



## సమరశీల ఉద్యమ చరిత్ర కలిగిన సంఘం

### ఏఐఎస్ఎఫ్



కోసిగి, ఆగస్టు12 (విభారె న్యూస్) సమరశీల ఉద్యమ చరిత్ర కలిగిన సంఘం ఏఐఎస్ఎఫ్ అని మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రతాప్, డాక్టర్ రాజన్న, ఎం.రాజు, ప్రకాష్ లు అన్నారు. ఈరోజు కోసిగిలో స్థానిక సీపీఐ కార్యాలయం ముందు ఏఐఎస్ఎఫ్ 88వ వార్షికోత్సవాలు తాలుక అధ్యక్షులు వీరేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సంద్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు ప్రతాప్ పతాక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు డాక్టర్ రాజన్న మరియు ఎం.రాజు, ప్రకాష్ హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ సమరశీల విద్యార్థి ఉద్యమాల రథసారథి భారతదేశ విద్యార్థి లోకానికి స్ఫూర్తిని, చైతన్యాన్ని కలిగించి సంఘటితశక్తిగా ముందుకు నడిపించే చోదక శక్తి అఖిలభారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ అని వారన్నారు, బ్రిటిష్ పరాయి పాలకుల బానిస చర నుండి మాతృభూమి విముక్తికై వీరోచిత స్వాతంత్ర ఉద్యమంలో పొత్తిలలోనే పిడికిలి బిగించి స్వాతంత్రం మా జన్మ హక్కు అని చాటిందని వారు అన్నారు. 1936 ఆగస్టు 12న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో లక్నో నగరంలోని, బెనారస్ విశ్వవిద్యాలయంలో పుట్టి, పెరిగి అశేష త్యాగాలు చేసి సుదీర్ఘ చరిత్ర కలిగి 88వ సంవత్సరంలోకి అడుగు పెట్టిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని వారు తెలిపారు. నాటినుండి నేటి వరకు విద్యారంగ సమస్యల పరిష్కారానికై అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తూ ఎన్నో విజయాలను సాధించిన విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని వారు తెలిపారు. ప్రస్తుత మోడీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం తీసుకువచ్చి విద్యను ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయకరణ చేయడానికి కుట్ర చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు. బాల్యం నుంచే విద్యార్థుల మెదడులోకి మత్తత్వ భావాజాలాన్ని నింపుతున్నారని అటువంటి విద్యా విధానం పట్ల విద్యార్థులందరూ ఏకతాటిపై కొచ్చి పోరాటాలు చేయవలసిన అవసరం ఆవశ్యకత ఉందన్నారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 3,4,5 తరగతులను హైస్కూల్స్ లో విలీనం చేసి వేలాది పాఠశాలను మూసివేశారని, హై స్కూల్స్ కు పోవడానికి రవాణా సౌకర్యాలు లేక డ్రాప్ అవుట్స్ సంఖ్య మరింత పెరుగుతున్నది అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అనేక విద్యా, వ్యతిరేక విధా నాల వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతున్నదని, ఈ విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టే విధంగా పోరాటాలకు విద్యార్థులు సిద్ధం అవ్వాలని వారు పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐ ఎస్ఎఫ్ మండల కార్యదర్శి అంజి మండల నాయకులు హనుమంతు, దుర్గ, మహేష్,మల్లికార్జున,అశోక్,రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో భారీగా విద్యుత్ కోతలు

విజయవాడ, ఆగస్టు 12, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ కోతలకు కారణాన్ని చెప్పాయి విద్యుత్ సంస్థలు. విధిలేని పరిస్థితుల వల్లే విద్యుత్ కోతలు విధించాల్సి వస్తోందని తేల్చి చెప్పాయి. డిమాండ్ కు తగ్గ వనరులు అందుబాటులో లేవని దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో విద్యుత్ కోతలు విధించాల్సి వస్తోందని సంస్థలు ప్రకటించాయి. పవన విద్యుత్ ఉత్పత్తి ఒక్కసారిగా తగ్గడం సమస్యకు ప్రధాన సమస్యగా పేర్కొన్నాయి సంస్థలు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని చెప్పాయి. గత ఏడాది ఇదే సమయానికి ఏపీలో విద్యుత్ వినియోగం 165 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉండగా.. ప్రస్తుతం అది కాస్త రోజుకు 235 మిలియన్ యూనిట్లకు పెరిగిందని తెలిపారు. సుమారు 70 ఎంయూల డిమాండ్ పెరగడంతో దానిని సర్దుబాటు చేసేందుకు కోతలు తప్పక విధించాల్సి వస్తోందని సంస్థలు వివరించాయి.సీజన్ లో అత్యధికంగా రావాల్సిన పవన విద్యుత్ ఉత్పత్తి కనీసం 30 శాతం కూడా రాకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు విద్యుత్ సంస్థల అధికారులు చెబుతున్నారు. రోజులో 10 శాతం ఉత్పత్తి మాత్రమే పవన విద్యుత్ నుంచి వస్తున్నట్లు తెలిపారు. కృష్ణానదిలో నీరు లేనందు వల్ల జల విద్యుత్ ఉత్పత్తి సాధ్యం కావడం లేదని పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్ నుంచి విద్యుత్ కొందామన్నా ప్రతిపాదించిన మొత్తంలో కనీసం 10 నుంచి 20 శాతం కూడా లభించడం లేదని చెప్పారు. బొగ్గు కొరత కారణంగా హిందుజా ఉత్పత్తి పడిపోయినట్లు చెప్పుకొచ్చారు. జెన్ కో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో కొన్ని వార్షిక మరమ్మతుల నిర్వహణలో ఉన్నాయని వెల్లడించారు. ముందస్తు ఒప్పందాల ద్వారా విద్యుత్ కొనడానికి ప్రయత్నిస్తున్నట్లు విద్యుత్ సంస్థలు వెల్లడించాయి. మూడ్రోజుల నుంచి రాష్ట్రంలో విద్యుత్ కోతలు అధికమయ్యాయి. గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ఉక్కపోతకు జనం అల్లాడిపోతున్నారు. రాత్రి వేళలో విద్యుత్ కోతలతో దోమల బెడద ఎక్కువై చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. చాలా ప్రాంతాల్లో విపరీతంగా విద్యుత్ కోతలు ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ సబ్ స్టేషన్లను ముట్టడిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులకు కూడా ఏం చెప్పాలో తెలియక.. వారు కూడా తమ ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మరి ఈ పరిస్థితి ఇంకెన్ని రోజులు ఉంటుందో అనేది విద్యుత్ సంస్థల అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులతో రెండ్రోజుల క్రితం ఏపీ ప్రభుత్వం జరిపిన చర్చలు ఫలించాయి. దీంతో విద్యుత్ ఉద్యోగులు తలపెట్టిన ఆందోళన కార్యక్రమాన్ని విరమించారు. సమ్మె నోటీసు ఉపసంహరించుకుంది విద్యుత్ సంఘాల జేఏసీ.

## వడివడిగా క్రిస్ సిటీ అడుగులు...

నెల్లూరు, ఆగస్టు 12, జగన్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించదలచిన భారీ పారిశ్రామిక నగరం అభివృద్ధికి శ్రీకారం చుట్టబోతోంది. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ లో భాగంగా ఈ నగరాన్ని మూడు దశల్లో నిర్మించడం జరుగుతుంది. దీనికి సంబంధించిన మొదటి దశ అభివృద్ధికి పర్మిషన్ ఇచ్చింది.కృష్ణపట్నం నోడ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఏపీఐఐసీతో కలిసి క్రిస్ సిటీ పేరుతో ఓ ప్రత్యేక కంపెనీని ఏర్పాటు చేసింది. ఈ క్రిస్ సిటీలో కొన్ని ప్రత్యేకతలున్నాయి. ఈ సిటీలో భారీ పరిశ్రమలతో పాటు వాక్ టు వర్క్ విధానంలో అక్కడే నివాసముండేలా ఓ నగరాన్ని కూడా నిర్మాణం చేపట్టింది.పరిశ్రమలతోపాటు అక్కడ ఉండే నివాస ప్రాంతానికి కూడా అత్యాధునిక వసతులు ఏర్పాటు చేస్తుంది. ఈ సిటీ మొత్తం 10,834.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటవుతుంది.

# సెల్ఫ్ గోల్ చేసుకుంటున్న వైసీపీ



విజయవాడ, ఆగస్టు 12,అధికారం చేతిలోకి వచ్చిన తర్వాత దాన్ని పోగొట్టుకోవాలని ఎవరూ అనుకోరు. నిలబెట్టుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తారు. మొదటి మూడేళ్లు ఎలా రాజకీయం చేసినా.. ఎలా పరిపాలన చేసినా.. చివరి రెండేళ్లు మాత్రం రాముడు మంచి బాలుడు తరహాలో.. ప్రభుత్వం చాలా మంచిది అనే భావన ప్రజలకు కల్పించడానికి శతవిధాలా ప్రయత్నాలు చేస్తారు. విపక్షాలు ఎంత రెచ్చగొట్టినా.. తమ ప్లస్ పాయింట్లను హైలెట్ చేయడానికే ప్రయత్నిస్తాయి. కానీ ఈ సంప్రదాయ రాజకీయానికి వైసీపీ అధినేత జగన్ బ్రేకిచ్చారు. ఎన్నికల చివరి వరకూ.. తనదైన ఉద్రిక్తతల రాజకీయం నడిపించేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ప్లస్ పాయింట్లు చర్చల్లోకి రావడం లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు కానీ.. వైఎస్ఆర్‌సీపీ నేతల దుందుడుకు చర్యల వల్ల కానీ.. ఏపీలో ప్రభుత్వ పాలనా తీరుపై ఎప్పుడూ ఏదో ఓ వ్యతిరేక ప్రచారమే జరుగుతూ ఉంటుంది. గత వారమే తీసుకుంటే పుంగనూరు దాడులతో కలకలం రేగింది. తర్వాత చిరంజీవి ఏదో అన్నారని ఆయనపై విరుచుకుపడ్డారు. ఈ రెండు అంశాల్లోనూ ప్రభుత్వ తీరు సామాన్యుల్లో .. విస్మయానికి గురి చేసింది. గత నాలుగేళ్లుగా అమరావతి దగ్గర నుంచి పోలవరం వరకూ అన్ని విషయాల్లోనూ ఎప్పుడూ ఏదో ఓ వివాదం వెంటాడుతూనే ఉంది. విపక్ష పార్టీలపై దాడులు, కేసులు.. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి వంటివి కూడా హైలెట్ అయ్యాయి. అయితే ఎన్నికలు దగ్గర పడుతున్నా అవే ఉద్రిక్తలు కనిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఏకైక లక్ష్యం సంక్షేమం. అభివృద్ధిని పెద్దగా పట్టించుకోలేదు. ప్రజలందరి ఇళ్లకూ పథకాలు అందించడమే టార్గెట్ గా పెట్టుకుంది. దీన్ని ప్రచారం చేసుకోవడానికి మూడేళ్ల కిందటి నుంచి ప్రణాళికలు రూపొందించుకుంది. గడప గడపకూ మన ప్రభుత్వం, స్పందన, జగనన్న సురక్ష, జగనన్నకు చెప్పుకుందాం.. ఇలా వరుస కార్యక్రమాలు ప్లాన్ చేశారు. కానీ ఎప్పుడూ అవి హైలెట్ కాలేదు. ఎక్కడైనా ప్రజలు ప్రజా ప్రతినిధుల్ని నిలదీస్తే అవే హైలెట్ అయ్యాయి. అదే సమయంలో బటన్ నొక్కే సభల్లో కూడా సీఎం జగన్ తన సంక్షేమ పథకాల గురించి పైపైన చెప్పుకుని మిగతా సమయం అంతా విపక్షాలను విమర్శించడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. దాంతో ఆ మాటలే హైలెట్ అవుతున్నాయి. అందుకే ఇప్పటి వరకూ ప్రభుత్వ పథకాల ప్రభావం ప్రజలపై ఎంత ఉందనేదానిపై రాజకీయవర్గాలు అంచనాకు రాలేకపోతున్నాయి. రాజకీయాల్లో కక్ష సాధింపులు అనేవి.. వేధింపులకు గురయ్యే వారికి ఓ అద్భుతమైన అవకాశాన్ని ఇస్తాయి. ఎందుకంటే ప్రజలు సానుభూతి చూపిస్తారు. అందుకే ఎక్కడైనా రాజకీయ పార్టీలు .. ప్రత్యర్థులపై వేధింపులకు పాల్పడే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తాయి. ఇబ్బంది పెట్టాలని అనుకుంటాయి కానీ.. ప్రజల నుంచి సానుభూతి లభించే అంతగా చేయాలని అనుకోవు. కారణం ఏదైనా.. గత నాలుగేళ్లుగా ఏపీలో విపక్ష పార్టీ నేతలపై ఎప్పుడూ జరగనన్ని దారుణాలు జరిగాయని.. రాజకీయంగా ప్రభుత్వం మారితే అధికార పార్టీ నేతలు ఇబ్బంది పడుతారన్న చర్చ జరుగుతోంది. మొత్తంగా రాజకీయాల్లో చర్చ అంతా.. వైసీపీ పాలనలోని మైనస్‌లపై నే సాగుతోంది ..కానీ వైసీపీ నమ్ముకున్న పథకాలు.. సంక్షేమంపై మాత్రం సాగడం లేదు. దీనికి ఆ పార్టీ చేసుకున్న స్వయంకృతమే కారణం.

## ఆత్మకూరు బ్యాంక్ నుంచి డబ్బులు మాయం

కర్నూలు, ఆగస్టు 12, సైబర్ నెరగాళ్లు రెచ్చిపోతున్నారు. విశాల్ నటించిన అభిమన్యుడు సినిమాను తలపించేలా ఖాతాదారుల ప్రమేయం లేకుండా అకౌంట్లో నుండి డబ్బులను మాయం చేస్తున్నారు. ఆత్మకూరు పట్టణంలోని ఎస్బీఐ, యూనియన్ బ్యాంక్. కొత్తపల్లిలోని ఎస్బీఐ బ్యాంక్ కు చెందిన పలు ఖాతాదారుల అకౌంట్‌లో ఈనెల 5 నుండి ఆత్మకూరు పరిసర ప్రాంతాల్లో ఇప్పటివరకు సుమారు 70 మంది ఖాతాదారుల నుండి లక్షల రూపాయలలో డబ్బులు విత్ డ్రా కావడంతో బాధితులు బ్యాంకులు, పోలీస్ స్టేషన్ చుట్టూ పరుగులు తీస్తున్నారు. కష్టపడి సంపాదించి దాచుకున్న సొమ్మును బ్యాంకుల్లో తమకు తెలియకుండానే సైబర్ నేరగాళ్లు దోచుకోవడంతో ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వ పథకాల కోసం, ఆధార్ అప్డేట్, ఇతర అవసరాల కోసం వేసిన వేలిముద్రలను అక్రమంగా ఉపయోగించుకుని పేదలు, నిరక్షరాస్యులను టార్గెట్ చేస్తూ వారి అకౌంట్లో ఉన్నటువంటి డబ్బులను సైబర్ నేరగాళ్లు కొల్లగొడుతున్నారు.తాము డబ్బు తీసుకోకున్నా.. ఖాతాలు నుంచి నగదు విత్ డ్రా చేసినట్లు మొబైల్ ఫోన్లకు సందేశం రావడంతో బాధితులు బ్యాంకులకు, పోలీస్ స్టేషన్ చుట్టూ పరుగులు తీస్తున్నారు. ఖాతాదారులు బ్యాంకుల వద్దకు వెళ్లి విచారిస్తే వినియోగదారుల సేవా కేంద్రాల ద్వారా డబ్బులు తీసుకున్నట్లు నిర్ధారణ అయ్యింది. ఇటీవల చాలామంది మహిళల ఖాతాల్లో అమ్మ ఒడి నగదు జమైంది. చాలామంది సీఎస్పీ కేంద్రాలకు వెళ్లి డబ్బులు తీసుకున్నారు. బ్యాంకుల్లో రద్దీ అధికంగా ఉండటం, సర్వర్లు పని చేయకపోవడంతో కొందరు సీఎస్పీ కేంద్రాలను సంప్రదించారు. ఇలా ప్రభుత్వ పథకాల కోసం, ఆధార్ అప్డేట్ చేసుకునే సమయంలో వేలిముద్రలు వేశామని కొంతమంది బాధితులు చెబుతున్నారు. వారి ఆధార్, వ్యక్తిగత వివరాలు బహిర్గతం కావడంతో ఆధునిక సాంకేతికను వినియోగించి వేలిముద్రలు చోరీ చేసి నగదు తస్కరిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. మరికొందరు స్థలాలు పొలాల రిజిస్ట్రేషన్ కోసం రిజిస్ట్రేషన్‌లో వేలిముద్రలు వేసామని అక్కడ ఏమైనా పొరపాటు జరిగిందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.కష్టపడి సంపాదించి బ్యాంకుల్లో దాచుకున్న సొమ్మును తమకు తెలియకుండానే ఇతరులు దోచుకోవడంతో ఖాతాదారులు కలవరం చెందుతున్నారు. ప్రభుత్వ పథకాల కోసం, ఆధార్ అప్డేట్, ఇతర అవసరాల కోసం వేసిన వేలిముద్రలను అక్రమంగా ఉపయోగించుకుని తాము డబ్బు తీసుకోకున్నా.. ఖాతాల నుంచి నగదు విత్ డ్రా చేసినట్లు మొబైల్ ఫోన్లకు సందేశం రావడంతో బాధితుల బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు. ఆత్మకూరు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాలకు చెందిన పలువురి బ్యాంకు ఖాతాల నుంచి వరుసగా మూడు రోజులపాటు నగదు తీసుకున్నారు. ఒక్కొక్కరి ఖాతా నుంచి రూ.6,500 రూ.7,000, రూ.9000 రూ.11,000, రూ.20,000 తీసుకున్నారు.మండలంలోని బైర్లూటి, నాగలూటి గూడేలకు చెందిన నలుగురు ఖాతాల

నుంచి 30 వేలు, రూ.40 వేలు, రూ.50 వేలు జిల్లా చొప్పున దోచుకున్నారు. ఖాతాదారుల్లో ఇప్పటి వరకు సుమారు 70 మంది బాధితులను ఉన్నట్టు సమాచారం.. ఖాతాదారులు బ్యాంకుల వద్దకు వెళ్లి విచారిస్తే వినియోగదారుల సేవా కేంద్రాల ద్వారా డబ్బులు తీసుకున్నట్లు నిర్ధారణ అయ్యింది. ఇటీవల చాలామంది మహిళల ఖాతాల్లో అమ్మఒడి నగదు సీఎస్పీ కేంద్రాలకు వెళ్లి డబ్బులు తీసుకున్నారు. బ్యాంకుల్లో రద్దీ అధికంగా ఉండటం, సర్వ పని చేయకపోవడంతో కొందరు సిఎస్పీ కేంద్రాలను సంప్రదించారు. ఇలా ప్రభుత్వ పథకాల కోసం, ఆధార్ అప్డేట్ చేసుకునే సమయంలో వేలిముద్రలు వేశామని చొప్పున కొంతమంది బాధితులు చెబుతున్నారు. ఆధార్, వ్యక్తిగత వివరాలు బహిర్గతం కావడంతో ఆధునిక వినియోగించి వేలిముద్రలు చోరీ చేసి నగదు తస్కరిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. కొసమెరుపు ఏమిటంటే ఆత్మకూరు ఎస్బీఐ లో పనిచేస్తున్న పీల్డ్ అపిసర్ ఇంట్లో నలుగురి ఖాతల నుండి అమౌంట్ కట్ కావడం విశేషం.

## రూ.25 లకు వచ్చేసిన టమోట




తిరుపతి, ఆగస్టు 12, వారం క్రితం టమాట కొనాలంటేనే సామాన్యుడు బెంబేలెత్తిపోయాడు. కిలో టమాట ధర ఏకంగా రూ.250 నుంచి రూ.300 వరకు పలికింది. 15 రోజులకు ముందు దేశంలోని పలు ప్రాంతాల్లో దాదాపు ఇలాంటి పరిస్థితే ఉంది. కానీ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. వరకు భారీగా పెరిగిన టమాటా ధరలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఇక తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కిలో టమాట ధర రూ.150 నుంచి రూ.200 వరకు పలికింది. గత నెలలో విస్తారంగా కురిసిన వర్షాల కారణంగా గత వారం రోజులుగా టమాటా దిగుబడి పెరిగింది. దీంతో ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. హైదరాబాద్‌లోని రైతు బజార్‌లలో కిలో టమాటా గత సోమవారం రూ.63 నుంచి రూ.70 పలికింది. ఇక ఏపీలోని రాయలసీమలోని అనంతపురం, చిత్తూరు, కర్ణాటక నుంచి భారీగా టమాటా దిగుబడి అవుతోంది. తెలంగాణలోనూ టమాటా దిగుబడి పెరిగింది. అంతేకాకుండా రంగారెడ్డి, వికారాబాద్, మెదక్ జిల్లాల నుంచి కూడా టమాటా అధికంగా రవాణా కావడంతో హైదరాబాద్‌లోని వివిధ రైతు బజార్లలో శుక్రవారం మొదటి రకం టమాటా కిలో రూ.30 నుంచి రూ.40 పలికింది.రెండో రకం టమాటా కిలో రూ.21 నుంచి రూ.28 వరకు పలికింది. ఇదే మాదిరి నిన్న గురువారం కూడా టమాటా ధర భారీగా పతనమైంది. మేలి రకం టమాటా కిలో రూ. 50 నుంచి రూ.64 వరకు ధర పలకగా.. రెండో రకం టమాటా కిలో రూ.36 నుంచి రూ.48 వరకు పలికింది. టమాటా దిగుబడి పెరగడంతో టమాటా ధరలు తగ్గాయని, ఇంకా తగ్గే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా టమాట ధర భారీగా పెరగడంతో అనేక మంది రైతులు టమాటా సాగు చేస్తున్నారు.

## తిరుమలలో దారుణం...

### చిన్నారిని చంపేసిన చిరుత

తిరుపతి, ఆగస్టు 12, అలిపిరి నడక మార్గంలో విషాదం నెలకొంది. అలిపిరి నడక మార్గంలో చిన్నారిపై చిరుత దాడి చేసింది. ఆరేళ్ల లక్షితను అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లింది. చిరుత దాడిలో తీవ్రంగా గాయపడిన లక్షిత మృతి చెందింది. తమ బిడ్డను చిరుతు లాక్కెళ్లిందని పోలీసులకు పాప తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. లక్షిత మృతి దేహం కోసం టిటిడి అటవీ శాఖ, విజిలెన్స్, పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. నడక మార్గంలో నరసింహ స్వామి ఆలయం వద్ద ఈ దాడి జరిగింది. నెల క్రితం మూడేళ్ళ బాలికపై చిరుత దాడి చేసింది. రాత్రి తిరుమలకు వెళ్తున్న టైంలో పాపను చిరుతు లాక్కెళ్లిపోయింది. అయితే పాపా తప్పిపోయిందని అంతా అనుకున్నారు. తమతో వచ్చిన పాప కనిపించడం లేదని పోలీసులుకు లక్షిత ఫ్యామిలీ ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు సీక్రెట్‌గా విచారణ చేపట్టారు. రాత్రాంతా గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రంగా గాలింపు చర్యలు చేపట్టినా పోలీసులు, టీటీడీ సిబ్బంది పాప కనిపించలేదు. ఉదయం సెర్చ్ ఆపరేషన్ చేపట్టాలని నిర్ణయానికి వచ్చారు. అయితే కాలినడకన వెళ్తున్న భక్తులకు లక్షిత డెడ్‌బాడీ కనిపించింది. చాలా మంది ఆ దృశ్యాలను చూసి భయపడిపోయారు. వెంటనే కొందరు తిరుమల సిబ్బంది, పోలీసులకు ఫిర్యాదు చేశారు. భక్తుల నుంచి ఫిర్యాదు అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి డెడ్‌బాడీని పరిశీలించారు. ఫ్యామిలీ చెప్పిన ఆనవాళ్లు ఉండటంతో అది లక్షిత మృతదేహంగా గుర్తించారు. భక్తుల ద్వారా సమాచారం విషయం బయటకు వచ్చింది. పాప మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రుయా ఆసుపత్రికి తరలించారు.

# షర్మిల ఏపీకా.. తెలంగాణకా



విజయవాడ, ఆగస్టు 12, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి కుమార్తె, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సోదరి.. వైఎస్ షర్మిల కారణాలు ఏవైనా, రెండేళ్ళ క్రితం తెలంగాణ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. వైఎస్సార్ తెలంగాణ పార్టీ ( వైఎస్సార్ టీపీ) ఏర్పాటు చేశారు. తెలంగాణలో వైఎస్ పాలన అందిస్తామని ప్రజల్లోకి వెళుతున్నారు. అయితే, అప్పటి నుంచీ... ఆమె ఏపీ గురించి ఇసుమంతైనా పట్టించుకోలేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి తెలంగాణ వాదాన్ని బలంగా వ్యతిరేకించిన సంగతి తెలంగాణ వాదులందరికీ తెలిసిందే. అటువంటి వ్యక్తి కుమార్తె.. తెలంగాణలో వైఎస్ పాలనను అందిస్తానంటూ రాష్ట్ర రాజకీయాలలో ప్రవేశించడమే విశేషం అనుకుంటే.. అంతటితో ఆగకుండా ఆమె సుదీర్ఘ పాదయాత్ర చేశారు. జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ తో విభేదించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించిన సమయంలో షర్మిల అన్నకు అండగా ఉన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ కే మద్దతు పలికారు. అక్రమాస్తుల కేసులో అన్న జగన్ రెడ్డి జైలుకు వెళ్ళినప్పుడు... ఆమె 'నేను జగనన్న వదిలిన బాణం' అంటూ మూడు వేల కిలోమీటర్ల పాద యాత్ర చేశారు. వైసీపీని బతికించారు. అయితే ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న వదిలిన బాణాన్ని జగనన్న వదిలేశారో .. లేదా బాణమే జగనన్నను వదిలేసిందో తెలియదు కానీ పుట్టింటిని వదిలి మెట్టి నింటికి చేరుకున్నారు.తెలంగాణలో వైఎస్సార్ జెండా ఎగరేశారు. అప్పటి నుంచి ఆమె తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ పాలనకు వ్యతిరేకంగా తనదైన ప్రత్యేక పంథాలో పోరాటం సాగిస్తున్నారు.పాదయాత్రలు చేస్తున్నారు. అయితే ఇప్పుడు షర్మిల త్వరలోనే, వైఎస్సారు టీపీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే షర్మిల మాత్రం ఇంత కష్టపడి పార్టీని నడిపించిన తాను, పార్టీని ఎందుకు కాంగ్రెస్ లో విలీనం చేస్తానంటూ ఆ ప్రచారాన్ని ఖండిస్తున్నా.. ఆమె 'అడుగులు' మాత్రం విలీనం దిశగానే కదులుతున్నాయని పరిశీలకులు అంటున్నారు. అలాగే టీపీసీసీ నేతలు షర్మిల పార్టీ కాంగ్రెస్ లో విలీనం అన్న అంశంపై చర్చోపచర్చలు చేస్తున్నారు. కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన తర్వాత కొద్ది రోజులు సాగిన ఈ ప్రచారం మధ్యలో కొంత బ్రేక్ తీసుకుంది. కానీ, ఇప్పడు తాజాగా మరో మారు ఆ ప్రచారం జోరందుకుంది. అంతే కాదు షర్మిల చేరికకు ముహూర్తం కూడా ఖరారైందని అంటున్నారు. హస్తినలో సోనియాగాంధీ సమక్షంలో ఆమె కాంగ్రెస్ కండువా కప్పుకుని పార్టీని విలీన ప్రకటన చేస్తారని చెబుతున్నారు. కాంగ్రెస్‌లోకి రావడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, ఏపీ నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే అక్కడ పార్టీ కొంతవరకు తేరుకోవడానికి ఉపయోగపడుతుందనే అభిప్రాయం తెలంగాణ కాంగ్రెస్ వర్గాలలో వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, అలాగే సీనియర్ నాయకుడు వీహెచ్ లు తెలంగాణ కాంగ్రెస్ లో షర్మిల వేలు పెడితే అంగీకరించేది లేదని ఇప్పటికే కుండబద్దలు కొట్టేశారు.అయితే పార్టీలో తమ ప్రాబల్యాన్ని పెంచుకుని, రేవంత్ రెడ్డికి చెక్ పెట్టేందుకు పావులు కదుతున్న.. భువనగిరి ఎంపీ కోమటి రెడ్డి వెంకటరెడ్డికి వైఎస్ ఫ్యామిలీపై ఉన్నగౌరవంతో షర్మిల కాంగ్రెస్ లోకి వచ్చి తెలంగాణలో క్రియాశీలంగా పని చేస్తే బీఆర్ఎస్ ను మరింత బలంగా ఢీకొనే అవకాశాలు మెరుగౌతాయని అంటున్నారు. దీనికి తోడు వైఎస్ కుటుంబానికి సన్నిహితుడైన పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ గూటికి చేరడంతో షర్మిలకు తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలలోకి రెడ్ కార్పెట్ పరిచినట్లే అయ్యిందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.అయితే కాంగ్రెస్ హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకొంటుంది, దీనిపై తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఎలా స్పందిస్తారు, అనేది తెలియ వలసి వుంది. అయితే పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మాత్రం తాను పీసీసీ అధ్యక్షునిగా ఉన్నంత వరకు షర్మిలను గాంధీ భవన్ మెట్లు ఎక్కనీయనని భీషణ ప్రతిజ్ఞ చేశారు. అయితే, షర్మిల పైకి ఏమి చెప్పినా, నాలుగు దిక్కుల నుంచి గాంధీ భవన్ మెట్లు ఎక్కేందుకు చకచకా పావులు కదుపుతున్నారనే పరిశీలకులు అంటున్నారు. ఇక పోతే కాంగ్రెస్ అధిష్ఠానం, మరీ ముఖ్యంగా వైఎస్ ఆత్మగా అంతా చెప్పే కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేవీపీ రామచంద్రరావు మాత్రం షర్మిల కాంగ్రె?స్ లో చేరి ఏపీ పగ్గాలు చేపట్టాలనీ, తద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ కాంగ్రెస్ బలోపేతమయ్యే అవకాశలు ఉంటాయనీ భావిస్తున్నారు. ఆ దిశగా షర్మిలను ఒప్పించేందుకు తన వంతు ప్రయత్నాలు చేశారని కూడా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కర్ణాటక పీసీసీ చీఫ్, ఉప ముఖ్యమంత్రి డీకే శివ కుమార్ మొదలు రాహుల్ గాంధీ వరకు, పొంగులేటి, కోమటి రెడ్డి మొదలు ఇతర సీనియర్ నాయకులు అందరితోనూ వైఎస్ కుటుంబ బంధాలను పునరుద్ధరించే ప్రయత్నాలు షర్మిల సాగిస్తున్నారు. గతంలో బెంగుళూరు వెళ్లి మరీ డీకేకు వెళ్లి మరీ అభినందనలు తెలిపిన షర్మిల, గతంలో ఎప్పుడు లేని విధంగా రాహుల్‌గాంధీ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు అభినందనలు తెలుపుతూ ట్వీట్ చేశారు. ఈ పరిణామాలను గమనిస్తే, షర్మిల పాదాలు కాంగ్రెస్ దిశగా నడక సాగిస్తున్నాయన్నది తేటతెల్లమౌతోంది. అయితే.. వైఎస్ వారసురాలిగా.. ఆమె ఏపీలో ఎక్కువ ప్రభావం చూపగలుగుతారని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. జగన్ సర్కార్ విధానాల కారణంగా ప్రజలలో వైసీపీ పట్ల వ్యక్తమౌతున్న తీవ్ర వ్యతిరేకత.. షర్మిల కాంగ్రెస్ నాయకురాలిగా ఏపీలో అడుగుపెడితే అది కాంగ్రెస్ కు సానుకూలంగా మారుతుందని.. ప్రభుత్వ వ్యతిరేక ఓటు కాంగ్రెస్ వైపునకు మళ్లే అవకాశం ఉందని కాంగ్రెస్ హై కమాండ్ భావిస్తోంది.

## ఉచిత దంత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్. కె ఎమ్ రెడ్డి



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 12 విభారె న్యూస్ :- నంద్యాల జిల్లా రుద్రవరం మండలంలో వాసాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం యందు శనివారం కె ఎమ్ రెడ్డి డెంటల్ కేర్ వారు ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉచిత దంత వైద్య శిబిరాన్ని డాక్టర్ కె ఎమ్ రెడ్డి ప్రారంభించారు . ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు దంత సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో వాసాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం యందు ఉచిత దంత వైద్య శిబిరాన్ని దేవస్థానం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. ఇక్కడ కు వచ్చిన భక్తులకు పేద ప్రజలకు ఉచితంగా దంత సమస్యలు చూసామని తెలిపారు . ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షులు సింగతల మదు సుదన్ రెడ్డి. ఉపాధ్యక్షులు ఎల్వి రంగ నాయకులు. కోశాధికారి ఇ కె వి నరసింహులు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ఏ.ఐ.ఎస్.ఎఫ్ 88వ వార్షికోత్సవం



ఎమ్మిగనూరు టౌన్ ఆగస్టు 12 విభారె న్యూస్:-అఖిల భారత విద్యార్థి సమైక్య 88 వ వార్షికోత్సవాన్ని విద్యార్థి సంఘం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏ.ఐ.ఎస్.ఎఫ్.జాతీయ కార్యదర్శి రంగన్న పాల్గొని, స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో ఏ.ఐ.ఎస్.ఎఫ్. పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంలో భాగంగా విద్యను పూర్తిగాకాషాయీకరిస్తోందని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నవిద్యార్థి సంఘం నాయకుడు భగత్ సింగ్ పాఠ్యాంశాన్ని తొలగించి,నాటి బ్రిటిష్ ప్రభుత్వానికి వత్తాసుగా పనిచేసిన వీర సావర్కర్ పాఠ్యాంశాన్ని చేర్చడం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. జీవో నెంబర్ 117 ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, వారికి ఉచితంగా పాఠ్య పుపుస్తకాల అందజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర, రంగస్వామి, సమీవుల్లా, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## సైనికాధికారి సేవలు యువతకు ఆదర్శనీయం

### ఎంపి పోచా

నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 12 విభారె న్యూస్ విశ్రాంత భారత సైనికాధికారుల సేవలు యువతకు ఆదర్శనీయమని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషలు తెలిపారు. నంద్యాల మున్సిపాలిటీలో మన భూమి, మన దేశం కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మైనారిటీ సంక్షేమ సలహాదారు డిఎస్ హాబీబుల్లా, ఛైర్ పర్సన్ మాబున్నిసా మాట్లాడుతూ నా భూమి, నా దేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. మట్టిని దోసిళ్లలోకి తీసుకుని పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేసి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ, భగత్ సింగ్, రాణి రుద్రమదేవి వంటి ఎందరో పోరాటాల ఫలితంగా స్వాతంత్యం పొందామన్నారు. ప్రాణ త్యాగం చేసిన వారిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, మన బడి, నాడు - నేడు, జగనన్న గోరుముద్ద వంటి పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలోకి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కేసీ కెనాల్ ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలి

### సిపిఐ. జిల్లా నాయకులు



నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 12 విభారె న్యూస్ :-నందికొట్కూరు తాలూకా మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా పంపింగ్ స్టేషన్1 నుండి కేసీ కెనాల్ ఆయకట్టు రైతులకు నీరు వదిలి ఆదుకోవాలని సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నంద్యాల లో కేసీ కెనాల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుమలేశ్వర్ రెడ్డి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శిఎన్.రంగనాయుడు, సహాయ కార్యదర్శిఎస్.బాబా ఫక్రుద్దీన్ తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. నంద్యాల జిల్లాకు చెందిన మంత్రులు శాసన సభ్యులు. ఖరీఫ్ సీజను వచ్చిన రైతులు సాగునీటి కోసం ఆయకట్టు రైతులు ఎదురుచూస్తూన్నా మల్యాల ఎత్తిపోతల పథకం పంపింగ్ స్టేషన్ ద్వారా కేసీ కెనాల్ నీటిని విడుదల చేయకపోవడం విచారకరమని. రాష్ట్ర కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గురించి గొప్పలు చెప్పుకుంటున్న అధికార పార్టీ శాసనసభ్యులు జిల్లాలో రైతులు పడుతున్న ఇబ్బందుల గురించి చేతకాని తనంతో ముఖ్యమంత్రి గారికి వివరించి చెప్పక నీరు విడుదల చేపించక పోవడము విచారకరమని అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు నీరు చేరి 15 రోజులు కా వస్తున్నప్పటికీ ఇంతవరకు నీరు వదలకపోవడం వరి పంట వేసే రైతులు నీటి కోసం కళ్ళు కాయలు కాచేతట్టు ఎదురుచూస్తున్నారని నీటిపారుదల శాఖ అధికారులు ఆరుతడి పంటలు వేయమని చెప్పడము తగదని ఆయకట్టు కాలువలకు వెంటనే నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని నిర్లక్ష్యం చేస్తే ప్రత్యక్ష ఆందోళన రైతుల సమీకరించి పోరాటాలకు సీపీఐ ఆధ్వర్యంలో పోరాటం చేసేందుకు సన్నద్ధమవుతున్నామని ఇప్పటికైనా, జిల్లాలో ఉన్న ప్రజా ప్రతినిధులు సిగ్గుతెచుకోవాలని, పోతిరెడ్డి పాడు నీటి విడుదల పై పెట్టిన ద్రుష్టి జిల్లా రైతుల పట్ల లేదని,తక్షణమే జిల్లా కలెక్టర్ గారు స్పందించి సాగునీరు విడుదల చేయాలని పై నాయకులు డిమాండ్ చేశారు.

## శ్రావణమాసం ఉత్సవాలకు ముస్తాబవుతున్న నరసింహ (ఈరన్న) స్వామి దేవస్థానం

కౌతాళం ఆగష్టు 12 విభారె న్యూస్. ఈనెల 17వ తేదీ నుండి వచ్చే నెల 14 వ తేదీ వరకు నెల రోజుల పాటు జరిగే శ్రావణమాస ఉత్సవాలకు నరసింహ (ఈరన్న) స్వామి దేవాలయం ముస్తాబవుతున్నది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్,ఎగ్జిక్యూటివ్ అధికారిని వాణి ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నవి.కార్యనిర్వహణాధికారిని శ్రీమతి కె.వాణి మాట్లాడితూ శ్రావణమాస ఉత్సవాల కు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక ఇతర రాష్ట్రాల నుండి కూడా లక్షలాది మంది భక్తులు ఉత్సవాలలో పాల్గొంటారని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని భక్తులకు ప్రయాణ సౌకర్యములకు ఇబ్బంది కలగకుండా ఎమ్మిగనూరు, ఆదోని ఆర్టీసీ డిపోల నుండి ప్రత్యేక బస్సులను నడుపుతారని, భక్తులకు దర్శన నిమిత్తం ప్రత్యేక క్యూ లైన్ లు, త్రాగునీరు, స్నాన ఘట్టాలు, మరుగుదొడ్లు,స్త్రీలు బట్టలు మార్చుకొను గదులు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధను తీసుకుంటామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు వారు సహకారం అందిస్తారని శ్రావణమాసంలో భాగంగా 3వ సోమవారం, గురువారం దాదాపుగా లక్షల్లో భక్తులు పాల్గొంటారని వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని శ్రీమతి కే వాణి ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి ఆర్.నాగరాజ్ గౌడ్, పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో పనులు ముమ్మరంగా జరుగుచున్నవి అని ఆమె తెలిపారు. వీరి వెంట దేవస్థాన సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర రావు, కౌతాళం ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు



## సిరాగాపురం ఎంపీపీ స్కూల్ పై స్పందించిన సిఆర్పిఎఫ్ జిల్లా కన్వీనర్ డాక్టర్ లింగన్న

కర్నూలు ఆగష్టు 12 విభారె న్యూస్. కర్నూలు జిల్లా అలహర్వి మండలం సిరాగాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల యందు వంట వండే వారు లేక స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు వంట వండి పిల్లలకు వడ్డించడం స్థానికంగా కలవరం లేపింది. ఈ విషయంపై కర్నూలు జిల్లా సిఆర్పిఎఫ్ కన్వీనర్ లింగన్న స్పందించి సిరిగాపురం స్కూల్లో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న జ్యోతి తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.జ్యోతి మాట్లాడుతూ సిరిగాపురం గ్రామంలో ఉండే స్కూళ్లలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు విద్యాభ్యాసం ఉందని అయితే స్కూల్ మొత్తం మీద 62 మంది విద్యార్థులు ఉండగా అందులో నిత్యం 52 నుంచి 55 మంది విద్యార్థులు బడికి వస్తున్నారని వారికి గతంలో ఒకరు వంట వండేవారని కాకపోతే ప్రస్తుతం పెరిగిన ధరల నిమిత్తం గిట్టుబాటు కావడం లేదని వంట చేయడం వదిలివేయడం జరిగిందని దాంతో విద్యార్థులు ఆకలితో బాధపడటం చూడలేక తానే స్వయంగా వంట వండి పెడుతున్నానని లేకపోతే వారు కూడా పాఠశాలకు రావడం మానేస్తారని ఆమె తెలిపారు. దీనిపై ఎంఈఓ కి తెలియజేశామని కూడా లింగన్న తో తెలపడం జరిగింది. దీనిపై లింగన్న తక్షణమే ఎంఈఓ తో ఫోన్లో



మాట్లాడడం జరిగింది దీనిపై ఎంఈఓ స్పందిస్తూ స్థానిక స్కూల్ యందు సమస్య ఉన్న సంగతి నిజమే అని ఒప్పుకంటూ దీనిపై అన్ని విధాలుగా సమస్యను పరిష్కరించే దిశగా మార్గాలు వెతుకుతున్నామని దీనిపై వారంలోపు స్పష్టత ఇస్తామని వారు సిఆర్పిఎఫ్ డాక్టర్ లింగన్న తో తెలపడం జరిగింది. సాధ్యమైనంత తొందరగా సమస్యను పరిష్కరించాలని లేకపోతే దీనిపై డిఈఓ కి ఫిర్యాదు చేయాల్సి వస్తుందని కర్నూలు జిల్లా సిఆర్పిఎఫ్ కన్వీనర్ డాక్టర్ లింగన్న అన్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధించాలి

### ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే 117 జి. ఓ ను వెంటనే రద్దు చేయాలి..

### ఫ్యాప్టో

కర్నూలు ఆగష్టు 12 విభారె న్యూస్. రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది ఉద్యోగ,ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన ఆమె మేరకు సిపిఎస్ ను రద్దు చేసిపాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలని,ప్రాథమిక విద్యా వ్యవస్థను నాశనం చేసే జి. ఓ 117 ను వెంటనే రద్దు చేయాలని, ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్ కె.ప్రకాష్ రావు,రాష్ట్రకార్య వర్గ సభ్యులు జి.హృదయ రాజు జిల్లా చైర్మన్ ఎస్. గోకారి సెక్రెటరీ జనరల్ జి. తిమ్మప్ప లు ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు.తేదీ 12 .8.2023 న కర్నూలులో ధర్నా చౌక్ దగ్గర ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ మేరకు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ యస్ గోకారి అధ్యక్షతన 12 గంటల సామూహిక నిరసన కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమములో యు టి ఎఫ్ రాష్ట్ర సహద్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల ఏళ్ళప్ప,జయరాజు,ఎస్ టి యు రాష్ట్ర అదనపు కార్య దర్శి సి.నాగరాజు,రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న రాజు ,జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కే జనార్థన్.ఏ పి టి ఎఫ్ 257 రాష్ట్ర కార్యదర్శి రవి కుమార్,జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రంగన్న, నాగరాజు, హెడ్మాస్టర్ అసోసియేషన్ జిల్లా ప్రదాన కార్యదర్శి నారాయణ ,ఏ పి టి ఎఫ్ 1938 జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యస్. ఇస్మాయిల్ ,మరియా ఆనందం ఆప్టా రాష్ట్ర కార్యదర్శి మధుసుదన రెడ్డి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సేవా నాయక్ ,రాజా సాగర్ ,డి టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చంద్ర శేఖర్ ,జిల్లా అధ్యక్షుడు కృష్ణ, బి టి ఎ రాష్ట్ర కార్యదర్శి మాదన్న,అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భాస్కర్ సుధాకర్, ఏ పి సి పి ఎస్ ఇ ఏ జిల్లా గౌరవ అధ్యక్షుడు లింగా రెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత గౌరవ ముఖ్యమంత్రి, ఆనాటి ప్రతిపక్ష నేత వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో గల్లీ గల్లీ న మేము అధికారంలోకి వస్తే ఒక వారంలోపే సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు, ఉద్యోగులకు



సంబంధించిన డి.ఏ లను పెండింగ్లో పెట్టమన్నారు. ప్రభుత్వం ఏర్పడి ప్రస్తుతానికి నాలుగు సంవత్సరాలు పైబడినప్పటికీ సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయలేదన్నారు. ఆనాడు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చారు ఇప్పుడు తీరా ఓ పి ఎస్ సాధ్యం కాదు అని జిపిఎస్ ను అమలు చేస్తామన్నడం హాస్యాస్పదమన్నారు. ఎన్నికలలో ఎటువంటి హామీలు ఇవ్వకుండా, ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చకుండా, రాజస్థాన్ ,చతిస్గడ్, జార్ఖండ్ పంజాబ్ ,హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాలలో సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే దిశలో ఉన్నారన్నారు. అక్కడ సాధ్యమైనటువంటిది ఈ రాష్ట్రంలో ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ప్రాథమిక విద్యా వ్యవస్థను సర్వనాశనం చేసేటటువంటి జీవో నంబర్ 117 వలన ఈ సంవత్సరం ప్రాథమిక పాఠశాలలో ఎన్రోల్మెంట్ గణనీయంగా తగ్గిపోయిందని బడుగు బలహీన మైనారిటీ వర్గాల విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమయ్యారని తెలిపారు.జి.ఓ.117 ను వెంటనే రద్దుచేయాలని అన్నారు. గత జూన్ జూలై మాసాలలో రాష్ట్రవ్యాప్తంగా 7000 పాఠశాల సహాయకులు, 900 ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు 679 ఎంఈఓ 2 పోస్టులను పదోన్నతులు ,బదిలీల ద్వారా గందరగోళ పరిస్థితులలో ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా భర్తీ చేశారని, వారికి ప్రస్తుతం రెండు నెలల గడుస్తున్నా కేడర్ స్ట్రెంత్ అప్డేట్ కాక జీతాలు రానటువంటి పరిస్థితి నెలకొందని వారు నెల నెల కట్టేటువంటి గృహ రుణాలు వ్యక్తిగత రుణాలు ఇంటి అద్దెలు చెల్లించలేక అపరాధ రుసుముల కడుతూ మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. వెంటనే కేడర్స్ టెన్త్ అప్డేట్ చేసి వారికి జీతాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ గారు పర్యవేక్షణ పేరుతో సమాజంలో ఉపాధ్యాయులను చిన్నచూపు చూపే విధంగా ప్రవర్తిస్తున్నారని ఆయన వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు.గత చరిత్రలో ఎన్నడూ చూడలేని విధంగా పి ఆర్ సి డి ఏ బకాయిలను నాలుగు సంవత్సరాలలో వాయిదాల పద్ధతిలో చెల్లిస్తామనడం విడ్డూరంగా ఉందని వాటిని ఏక మొత్తంగా చెల్లించాలని డిమాండ్ చేశారు.బోధనకు ఆటంకంగా ఉన్నటువంటి యాప్లను వెంటనే రద్దు చేయాలని, ఫేషియల్ అటెండెన్స్ లో ఉన్నటువంటి ఇబ్బందులను తొలగించాలని,పిఎఫ్, ఏపీ జి ఎల్ ఐ సరెండర్ లీవ్ బిల్లుల చెల్లింపులు సమస్యను వెంటనే పరిష్కరించాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అన్ని ఆసుపత్రులలో అమలు అయ్యేవిదముగా చర్యలు తీసుకోవాలని, ఆగిపోయినటువంటి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్,తెలుగు, హిందీ ఉర్దూ పదోన్నతులను పూర్తి చేయాలని , ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి జూనియర్ లెక్చరర్ గా పదోన్నతులు కల్పించాలని,జీవో నెంబర్ 145 సవరించి రాబోయే పదోన్నతులలో సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ,కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎంటిఎస్ ను అమలు చేయాలని,మున్సిపల్, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు పదోన్నతులు బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఫ్యాప్టో నాయకులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో పాఠశాల విద్యా శాఖ కార్యాలయమును ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో సభ్య సంఘాల రాష్ట్ర/ జిల్లా /మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190